అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం... కానీ!: పొన్నం ప్రభాకర్

2

Neti Velugu
నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
RNI NO. TELTEL/2023/88559
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com

## రిపోర్టర్లు కావలెను

నేటి వెలుగు తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు
రిపోర్టర్లు కావలెను
తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో
మరియు మండల హెడ్ క్వార్టర్స్ లో రిపోర్టర్లు కావాలి
ఆసక్తి గలవారు ఈ నెంబర్కు సంప్రదించండి:-
సంపాదకులు పామనగుండ్ల నవీన్ కుమార్ గౌడ్
9553276552.

నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 1 | ఏప్రిల్ 2 గురువారం 2026 | పేజీలు : 4 | వెల రూ. 1.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 1 | PAGES:4 | THURSDAY APRIL 2 2026 | Rs. 1:00

# బీజేపీ ఓటు బ్యాంకు విజయన్‌కు బదిలీ అయ్యేలా మోదీ ప్రయత్నిస్తున్నారు: కేరళలో ప్రచారంలో రేవంత్ రెడ్డి



కేరళలో బీజేపీ ఓటు బ్యాంకు సీఎం పినరయి విజయన్‌కు బదిలీ అయ్యేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తిరువనంతపురంలోని ఎస్ఎం లాక్ జంక్షన్ నుంచి ముట్టతార వరకు రోడ్ షోలో పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయన్‌కు తేడా ఏమీ లేదని ఆయన విమర్శించారు.కేరళ ప్రజలు చాలా తెలివైనవారని, విద్యావంతులను, మతతత్వ శక్తులను అస్సలు అనుమతించరని అన్నారు. బీజేపీ లాంటి పార్టీలు అధికారంలోకి రాకుండా కేరళ ప్రజలు లక్ష్మణ రేఖ గీశారని వ్యాఖ్యానించారు. కేరళకు

(మిగతా 2వ పేజీలో..)

## తేయాకు ఆకులు కోసి, కార్మికులతో సెల్ఫీ దిగిన ప్రధాని నరేంద్రమోదీ




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అసోంలోని దిబ్రుగఢ్ జిల్లాలోని ఒక తేయాకు తోటను సందర్శించారు. అక్కడి మహిళా కార్మికులతో కలిసి తేయాకు ఆకులను కోశారు. వారితో సెల్ఫీలు దిగారు. ఈ ఫొటోలను మోదీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. పలువురు కార్మికులు మోదీతో సెల్ఫీ దిగేందుకు ఆసక్తి చూపించారు. మోదీ రాక నేపథ్యంలో గిరిజన కార్మికులు సంప్రదాయ నృత్యంతో ఆయనకు స్వాగతం పలికారు.

బహిరంగ సభలో రాహుల్ గాంధీపై విమర్శలు

అసోం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గోగముఖ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అసోంలో బీజేపీ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం

(మిగతా 2వ పేజీలో..)

## ఇరాన్ గత పాలకుడి కంటే ఇతను కొంచెం నయం: ట్రంప్



అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ కొత్త నాయకత్వం తమతో కాల్పుల విరమణ కోరిందని వెల్లడించారు. అయితే, తాము అందుకు అంగీకరించాలంటే కీలకమైన హర్మూజ్ సముద్ర మార్గంపై తమ షరతులకు ఒప్పుకోవాల్సి ఉంటుందని అన్నారు. అంతవరకు సైనిక ఒత్తిడి కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్

(మిగతా 2వ పేజీలో..)

## కాజీపేట రైల్వే డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేయండి: అశ్వినీ వైష్ణవ్‌కు కేటీఆర్ లేఖ



కాజీపేట రైల్వే డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే కేటీఆర్ లేఖ రాశారు. కేటీఆర్ రాసిన లేఖను బీఆర్ఎస్ ఎంపీల బృందం ఢిల్లీలో కేంద్రమంత్రికి అందించింది. ఈ విజ్ఞప్తికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు బీఆర్ఎస్ ఎంపీలు తెలిపారు.దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్‌పై పనిభారం విపరీతంగా పెరిగిందని కేటీఆర్ ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్ ట్రాక్ పరిధి 2,755 కిలోమీటర్లుగా ఉందని, మున్ముందు వాడి-రాయచూర్, విష్ణుపురం-బీబీనగర్ డబ్లింగ్ పనులు పూర్తయితే ఈ ట్రాక్ పరిధి 3,150 కిలోమీటర్లకు చేరుకుంటుందని తెలిపారు. భారతీయ రైల్వేల పరిపాలనా ప్రమాణాల ప్రకారం ఒక డివిజన్‌కు

(మిగతా 2వ పేజీలో..)

## బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీలు టచ్‌లో ఉన్నారు: కవిత



బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు తమతో టచ్‌లో ఉన్నారని, సమయం వచ్చినప్పుడు అన్ని విషయాలు ప్రకటిస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ, అసెంబ్లీలో సమయం అంతా అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం తిట్లు, విమర్శలు చేసుకోవడానికే సరిపోయిందని మండిపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను శ్రీరాముడిని, కేసీఆర్ రావణుడు అని చెబుతున్నారని, కానీ శకుని ఎవరో చెప్పాలని ఎద్దేవా చేశారు. తాను బర్బరీకుడిని అని ముఖ్యమంత్రి చెప్పుకుంటుంటే నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో మావోయిస్టులు కూడా తమ పార్టీలోకి

(మిగతా 2వ పేజీలో..)

## విజయ్ భద్రతపై కేంద్రానికి టీవీకే ఫిర్యాదు... లేఖలో తప్పుతో కొత్త వివాదం

తమిళనాడు రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ప్రముఖ నటుడు విజయ్ భద్రత అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆయనకు కల్పిస్తున్న భద్రత సరిపోవడం లేదని ఆరోపిస్తూ ఆయన పార్టీ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేసింది. అయితే, ఈ లేఖలో ఓ సీనియర్ అధికారి పేరును

(మిగతా 2వ పేజీలో..)



## శ్రీరాముని ఆశీస్సులతో ధర్మపాలన అందిస్తాం: ఒంటిమిట్టలో సీఎం చంద్రబాబు

శ్రీరాముడి ఆశీస్సులతో, ఆయన చూపిన మార్గంలో ధర్మాన్ని అనుసరించి రాష్ట్రంలో ధర్మబద్ధమైన పాలన అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాముడి పేరు వినగానే సుపరిపాలన, రామరాజ్యం గుర్తుకు వస్తాయని, అదే స్ఫూర్తితో తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. కడప జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఆయన తన అర్ధాంగి భువనేశ్వరితో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.అంతకుముందు, ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు టీటీడీ అధికారులు, పండితులు పూర్ణకుంభంతో

(మిగతా 2వ పేజీలో..)



## విద్యాశాఖపై లోకేశ్ సమీక్ష... మధ్యాహ్న భోజనం, క్లిక్కర్ విధానంపై కీలక ఆదేశాలు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా, విద్యావ్యవస్థలో చేపట్టాల్సిన సంస్కరణలపై ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో సమగ్రశిక్ష అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఎట్టి

(మిగతా 2వ పేజీలో..)



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

## బీజేపీ ఓటు బ్యాంకు విజయన్‌కు బదిలీ అయ్యేలా మోదీ ప్రయత్నిస్తున్నారు: కేరళలో ప్రచారంలో రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్తు లేకుండా చేయాలని మోదీ, పినరయి విజయన్ చూస్తున్నారని ఆరోపించారు. అందుకే బీజేపీ ఓటు బ్యాంకును ఎల్డీఎఫ్‌కు బదిలీ అయ్యేలా చూస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. కేరళలో పినరయి విజయన్ సమయం అయిపోయిందని, యూడీఎఫ్ సమయం వచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన మరోసారి ముఖ్యమంత్రి కావడానికి అవకాశమే లేదని అన్నారు. ఎన్నికల తర్వాత ఇక్కడ పాలించేది కాంగ్రెస్ పార్టీయేనని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేది తమ పార్టీయేనని అన్నారు.

## తేయాకు ఆకులు కోసి, కార్మికులతో సెల్ఫీ దిగిన ప్రధాని నరేంద్రమోదీ

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. కాంగ్రెస్ పార్టీ యువరాజు రాహుల్ గాంధీకి వందోసారి ఓటమి తప్పదని ఎద్దేవా చేశారు.అసోం మాజీ సీఎం శర్బానంద సోనోవాల్, ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ విభజన విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. అసోంలో ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఆదివాసీల హక్కులను కాపాడుతామని హామీ ఇచ్చారు.

## ఇరాన్ గత పాలకుడి కంటే ఇతను కొంచెం నయం: ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యాఖ్యలు చేశారు."గత పాలకుడితో పోల్చితే ఇరాన్ నూతన పాలకుడు (సుప్రీం లీడర్) కొంచెం నయం అనిపిస్తున్నాడు. అతడికి తక్కువ తీవ్రవాద భావజాలం, ఎక్కువ తెలివితేటలు ఉన్నాయి. ఇప్పుడతను అమెరికాతో కాల్పుల విరమణ కోరారు!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని స్వేచ్ఛగా, సురక్షితంగా తెరిచి ఉంచినప్పుడు మాత్రమే కాల్పుల విరమణ ప్రతిపాదనను పరిశీలిస్తామని ఆయన తేల్చిచెప్పారు. ప్రపంచ ఇంధన రవాణాలో హర్మూజ్ జలసంధి అత్యంత కీలకమైనది కావడంతో కాల్పుల విరమణకు ట్రంప్ ఈ అంశాన్ని ముందుకు తెస్తున్నారు. ఈ షరతులను నెరవేర్చే వరకు ఇరాన్‌పై సైనిక చర్యలను మరింత తీవ్రతరం చేస్తామని ట్రంప్ తన పోస్ట్‌లో హెచ్చరించారు. "మాటవినకుంటే ఇరాన్‌ను నామరూపాల్లేకుండా చేస్తాం లేదా వారు చెప్పినట్లుగా మళ్లీ రాతియుగానికి పంపిస్తాం!" అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కూడా విలేకరులతో మాట్లాడుతూ, ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు, ఒత్తిడిని కొనసాగించేందుకు తమ బలగాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణాను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## కాజీపేట రైల్వే డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేయండి: అశ్వినీ వైష్ణవ్‌కు కేటీఆర్ లేఖ

(మొదటి పేజీ తరువాయి)

ఉండాల్సిన పరిమితి కంటే ఇది ఎక్కువ అన్నారు.ఎక్కువ కిలోమీటర్లు, పనిభారం కారణంగా సికింద్రాబాద్ డివిజన్ నిర్వహణ క్లిష్టంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. కాజీపేట కేంద్రంగా డివిజన్‌ను ఏర్పాటు చేస్తే పరిపాలనా సులువు అవుతుందని అన్నారు. పరిపాలనా సౌలభ్యం, కార్యకలాపాల రీత్యా కాజీపేట డివిజన్ అత్యవసరమని ఆ లేఖలో పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీలు టచ్‌లో ఉన్నారు: కవిత

(మొదటి పేజీ తరువాయి)

వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వారిది, తమది ఒకే అజెండా అని తెలిపారు. పార్టీ ఆవిర్భావానికి ముందు ఉమాభారతి సహా ఇతర పెద్దలను కలిసి ఆశీర్వాదం తీసుకుంటానని కవిత తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా కోసం పోరాటం చేస్తామని తెలిపారు.యువతకు ఉద్యోగాలు దక్కకుండా జీవోల పేరుతో ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 40 లక్షల కుటుంబాలలోని విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతుండగా, ప్రభుత్వం మాత్రం వారికి న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారో చెప్పాలని నిలదీశారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు రేషన్ కార్డుల ఏరివేత కార్యక్రమం పెట్టుకుందని ఆరోపించారు. 15 లక్షల రేషన్ కార్డులు తీసివేయాలని చూస్తోందని మండిపడ్డారు.



# విజయ్ భద్రతపై కేంద్రానికి టీవీకే ఫిర్యాదు... లేఖలో తప్పుతో కొత్త వివాదం

(మొదటి పేజీ తరువాయి)

తప్పుగా ప్రస్తావించడం కొత్త వివాదానికి దారితీసింది.వివరాల్లోకి వెళితే, విజయ్‌కు " కేటగిరీ భద్రత ఉన్నప్పటికీ, ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు సరిపోవడం లేదని టీవీకే ఆందోళన వ్యక్తం చేసింది. మార్చి 30న పెరంబూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయ్ నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం పెరంబూర్, కొళత్తూర్, విల్లివాక్కం ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించాలని ప్లాన్ చేశారు. అయితే, పెరంబూర్, కొళత్తూర్‌లో ప్రసంగించిన తర్వాత, భద్రతా కారణాల రీత్యా విల్లివాక్కం పర్యటనను అర్ధంతరంగా రద్దు చేసుకున్నారు. భారీగా తరలివస్తున్న జనాన్ని నియంత్రించేందుకు పోలీసు బందోబస్తు సరిపోలేదని పార్టీ నేతలు పేర్కొన్నారు.ఈ ఘటనపై టీవీకే మొదట తమిళనాడు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత పార్టీ కార్యనిర్వాహకుడు సి.టి.ఆర్. నిర్మల్ కుమార్, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు దీనిపై ఒక లేఖ రాశారు. ఈ క్రమంలోనే బయటకు వచ్చిన లేఖ కాపీతో అసలు వివాదం మొదలైంది. ఆ లేఖలో కేంద్ర హోం శాఖ కార్యదర్శిగా అజయ్ కుమార్ భల్లా పేరును పేర్కొన్నారు. వాస్తవానికి, భల్లా ప్రస్తుతం మణిపూర్ గవర్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయన హోం శాఖ కార్యదర్శి పదవిలో లేరు.ఈ తప్పిదంపై రాజకీయ విశ్లేషకుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఒక అధికారిక లేఖలో ఇలాంటి పొరపాటు దొర్లడం పార్టీ విశ్వసనీయతను ప్రశ్నించేలా ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

# విద్యాశాఖపై లోకేశ్ సమీక్ష... మధ్యాహ్న భోజనం, క్లిక్కర్ విధానంపై కీలక ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని, కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. అదే సమయంలో, అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా 9వ తరగతి విద్యార్థులకు క్లిక్కర్ ఆధారిత విధానాన్ని అమలు చేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు.

**మధ్యాహ్న భోజనం, లీప్ యాప్‌పై దృష్టి**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతపై మంత్రి లోకేశ్ ప్రధానంగా దృష్టి సారించారు. ఈ విషయంలో ఎలాంటి ఫిర్యాదులకు తావివ్వకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, సోమవారం నుంచి లీప్ యాప్ ద్వారా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్నామని మంత్రికి వివరించారు. మంగళవారం నాటికి 6,719 పాఠశాలల నుంచి అభిప్రాయాలు సేకరించినట్లు తెలిపారు. ఈ ఫీడ్‌బ్యాక్ సేకరణ ప్రక్రియను పూర్తిగా ఆటోమేషన్ చేయాలని లోకేశ్ ఆదేశించారు. లీప్ యాప్ వినియోగంపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల పాత్ర చాలా కీలకమని, అభ్యసన ఫలితాల మెరుగుదలలో వారిని భాగస్వాములను చేయాలని అభిప్రాయపడ్డారు.

**క్లిక్కర్ విధానం, స్టూడెంట్ కిట్లపై సమీక్ష**

నూతన సాంకేతికతను విద్యారంగంలో వినియోగించడంపై సమావేశంలో చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న క్లిక్కర్ ఆధారిత పునశ్చరణ విధానంపై తల్లిదండ్రుల నుంచి సానుకూల స్పందన వస్తోందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన లోకేశ్, తొలుత రాష్ట్రవ్యాప్తంగా 9వ తరగతి విద్యార్థులందరికీ ఈ విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత దశలవారీగా ఇతర తరగతులకు విస్తరించాలని సూచించారు. మరోవైపు, ఇరాన్ యుద్ధం కారణంగా పెట్రోలియం ఆధారిత ఉత్పత్తుల లభ్యత తగ్గడంతో స్టూడెంట్ కిట్లపై ప్రభావం పడుతోందని అధికారులు వివరించారు. అయితే, విద్యార్థి మిత్ర కిట్ల నాణ్యత విషయంలో పూర్తిస్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు.

**ఆటిజం సెంటర్లు, ఖాళీల భర్తీ**

సమాజంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని లోకేశ్ తెలిపారు. ఇందులో భాగంగా ఆటిజం సపోర్ట్ సెంటర్ల ఏర్పాటుపై సమీక్షించారు. ఫేజ్-1 కింద చినకాకాని, బాపట్లలో నిర్మాణం పూర్తయిన కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని నిర్ణయించారు. ఫేజ్-2 కింద ఈ ఏడాది జూన్ నాటికి 28 కేంద్రాలు, నవంబర్ నాటికి 95 కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు వివరించారు. ఈ కేంద్రాల నిర్వహణకు నిమ్హాన్స్ (చీ×వీనాూచీూ) వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల సహకారంతో మానసిక వైద్యులు, కౌన్సిలర్లకు శిక్షణ ఇప్పించాలని మంత్రి ఆదేశించారు. కేజీబీవీ అడ్మిషన్లు, 1095 బోధనేతర, 277 బోధన సిబ్బంది నియామక ప్రక్రియలపైనా సమావేశంలో చర్చించారు.

**అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ**

ప్రజాప్రభుత్వం అమరావతిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన స్టేట్ సెంట్రల్ లైబ్రరీ ప్రాజెక్టుపై కూడా మంత్రి లోకేశ్ సమీక్ష జరిపారు. భవన తుది నమూనాను ఈ సందర్భంగా ఆమోదించారు. పనులను త్వరితగతిన ప్రారంభించి, 2028 నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మానవవనరుల శాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య డైరెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎండీ సీఎన్ దీవన్ రెడ్డి, పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాముని ఆశీస్సులతో ధర్మపాలన అందిస్తాం: ఒంటిమిట్టలో సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

ఘనస్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ నయనానందకరమైన కల్యాణ వేడుకను వేలాది మంది భక్తులు కనులారా వీక్షించారు. అనంతరం అర్చకులు ముఖ్యమంత్రిని ఆశీర్వదించి, స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.ఈ సందర్భంగా 'జై శ్రీరామ్' నినాదంతో తన ప్రసంగాన్ని ప్రారంభించిన చంద్రబాబు.. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సంపద, ఆరోగ్యంతో సంతోషంగా ఉండాలని శ్రీరాముడిని ప్రార్థించినట్లు తెలిపారు. "రాష్ట్ర విభజన అనంతరం ఒంటిమిట్ట ఆలయాన్ని టీటీడీలో విలీనం చేసి, ఏటా బ్రహ్మోత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నాం. ఈ రోజు మనకు ఎంతో పవిత్రమైనది" అని అన్నారు.ఇదే రోజు లోక్‌సభలో అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. "పూర్వం దేవేంద్రుడు పాలించిన రాజధాని అమరావతి అయితే, నేడు మనం నిర్మిస్తున్నది ప్రజారాజధాని అమరావతి. శ్రీరాముని ఆశీస్సులతో ధర్మాన్ని పాటించి మీకు అండగా ఉంటాం. రామరాజ్యంలాగే మీకు సుపరిపాలన అందిస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు హామీ ఇచ్చారు.

## అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం... కానీ!: పొన్నం ప్రభాకర్



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఏర్పాటుకు చట్టబద్ధత కల్పిస్తూ లోక్ సభలో బిల్లు ఆమోదించడాన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఇదే సమయంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.తెలంగాణ రాష్ట్రానికి విభజన సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లో తెలంగాణకు పలు కీలక హామీలు ఉన్నాయని, వాటి అమలు విషయంలో కేంద్రం వివక్షపూరితంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు.బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి కీలక ప్రాజెక్టులు ఇంకా ఆచరణకు నోచుకోలేదని అన్నారు. ఈ ప్రాజెక్టులు తెలంగాణ అభివృద్ధికి కీలకమని గుర్తుచేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఒక రాష్ట్రానికి చట్టబద్ధతతో ముందుకు తీసుకెళ్లే చర్యలు తీసుకుంటూ, మరో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను విస్మరించడం సరైనది కాదని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆత్మీయ అనుబంధాలు కనుమరుగవుతున్నాయి





**మనుషుల మధ్య ద్వేషం పెరిగి అనుబంధాలు మృగ్యమవుతున్నాయి: మంత్రి జూపల్లి**

**కొల్లాపూర్ ఏప్రిల్ 01 నేటి వెలుగు ప్రతినిధి**

ఆధునిక యుగంలో నింగికి శాటిలైట్లు పంపుతున్నప్పటికీ, మనిషి కుటుంబ బంధాలను కాపాడుకోవడంలో వెనుకబడిపోతున్నాడని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని చిన్నదగడ గ్రామస్థులతో ముచ్చటించిన సందర్భంగా ఆయన సమాజంలో పెరుగుతున్న అంతరాలు, రైతు సమస్యలు, యువత పెడ ధోరణి, ఆత్మహత్యలపై ఆందోళన వ్యక్తం చేశారు.నాడు తండ్రి మాట కోసం, తమ్ముడు భరతుని క్షేమం కోసం శ్రీరాముడు సంతోషంగా అడవుల బాట పట్టాడని, కుటుంబ గౌరవం కోసం త్యాగాలకు వెనుకాడని గొప్ప సంస్కృతి మనదని మంత్రి గుర్తు చేశారు. కానీ నేడు.. ఆత్మీయ అనుబంధాలు కనుమరుగవుతున్నాయని, ప్రేమానురాగాల కంటే సంపాదనపై మోజు పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్తి కోసం, స్వల్ప లాభాల కోసం తోడబుట్టిన వారి మధ్యే ద్వేషాలు పెరగడం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. నేడు సమాజంలో ఆత్మహత్యలు పెరగడానికి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడం కూడా కారణమేనని మంత్రి అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు ఇంట్లో పెద్ద దిక్కు ఉండేవారు. కష్టమొస్తే పంచుకోవడానికి, కష్ట సుఖాల్ని పంచుకోవడానికి మనుషులు ఉండేవారు. నేడు ఏకాకి జీవితాల వల్ల, చిన్న సమస్య ఎదురైనా తట్టుకోలేక, చర్చించే వారు లేక ఆత్మహత్యల వైపు మళ్లుతున్నారని పేర్కొన్నారు. అప్పుల బాధ, చిన్నపాటి మనస్పర్థలు ప్రాణాలు తీసుకునేంత పెద్దవి కావని, అందరూ కలిసి ఉంటే ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని ఆయన గ్రామస్తులకు హితోపదేశం చేశారు.మనం నింగిలోకి శాటిలైట్లను పంపుతూ అంతరిక్షాన్ని జయిస్తున్నాం.. కానీ, అదే ఆధునిక కాలంలో నదీ జలాలను పక్కనే ఉన్న పంట పొలాలకు మళ్లించలేకపోతున్నాం అని మంత్రి శాస్త్రీయ ప్రగతికి, క్షేత్రస్థాయి పరిస్థితులకు మధ్య ఉన్న అంతరాన్ని ఎత్తి చూపారు. రైతులకు భరోసా అందించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.సమాజంలో కుటుంబ, నైతిక విలువలు క్షీణించే కొద్దీ సామాజిక సంఘర్షణ (రాశీఎఋశ్రీ జశీఅటశ్రీఱష్), సామాజిక అశాంతి (రాశీఎఋశ్రీ ఖఅతీవర్) పెరిగే ప్రమాదం ఉందని అన్నారు. అందువల్ల సమాజంలో నెలకొన్న అనేక సామాజిక రుగ్మతలను రూపుమాపి ప్రజల్లో వాటిపై అవగాహన కల్పించేందుకు ప్రభాతభేరి అనే సామాజిక చైతన్య కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు తెలిపారు.

## ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్ లు, స్కానింగ్ కేంద్రాలు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం రేట్ చార్టులను అనుగుణంగా నడుచుకోవాలి ;జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి






**వనపర్తి జిల్లా ఏప్రిల్ 01 నేటి వెలుగు ప్రతినిధి**

ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్ లు, స్కానింగ్ కేంద్రాలు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ -2010 ప్రకారం రేట్ చార్టులను ప్రదర్శించడంతో పాటు, నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.బుధవారం మధ్యాహ్నం ఐ.డి. ఒ.సి కాన్ఫరెన్స్ హాల్లో ప్రయివేట్ హాస్పిటల్ రిజిస్ట్రేషన్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించి, పలు దరఖాస్తులను సమీక్షించారు.3 ఆసుపత్రులు, 3 క్లినిక్ లు, 1 డయాగ్నొస్టిక్ సెంటర్, 4 స్కానింగ్ కేంద్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకోగా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ పరిశీలన చేసింది. కొత్తగా ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్న కిరణ్ గ్యాస్ ట్రోల్ లివర్ ఎండోస్కోపీ సెంటర్ క్లినిక్, డాక్టర్ మనిషా రెడ్డి పాలి క్లినిక్, గాయత్రి డెంటల్ క్లినిక్ లకు ఆమోదం తెలిపింది. అదేవిధంగా కొత్త హాస్పిటల్ కోసం దరఖాస్తు చేసుకున్న రవీంద్రబాబు హాస్పిటల్, హైందవ్ న్యూరో హాస్పిటల్, ఆర్య హాస్పిటల్ కి కమిటీ ఆమోదం తెలిపింది. వీటితోపాటు ఒక డయాగ్నస్టిక్ సెంటర్, నాలుగు(2కొత్తవి ం2 రెన్యువల్) స్కానింగ్ కేంద్రాలకు కూడా కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కలెక్టర్న మాట్లాడుతూ ఆసుపత్రులు నిబంధనలకు తు.చ. తప్పకుండ పాటించాలని, సకాలంలో రెన్యువల్ కు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఆస్పత్రులు పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రులు, క్లినిక్ లలో రేట్ ఛార్ట్స్ తప్పక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా స్కానింగ్ కేంద్రాలలో ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా జాగ్రత్త పడాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవని తెలిపారు. అటువంటి సంఘటనలు ఏవైనా జిల్లాలో ఉంటే దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సాయినాథ్ రెడ్డి, డి ఎస్పీ బాలాజీ నాయక్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ శ్రీనివాసులు, డాక్టర్ బాబు, ఆర్డీఎస్ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్, ఇతర డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## దామచర్ల బీసీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ని డిస్మిస్ చేయాలి

**జిల్లా R,C,O గారిని సస్పెండ్ చేయాలి**

**బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్**

**మిర్యాలగూడ ఏప్రిల్ 01 నేటి వెలుగు ప్రతినిధి**



నల్గొండ జిల్లాలో గురుకుల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులలో ఉన్నారని మిర్యాలగూడలో బీసీ యువజన సంఘం సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ దామరచర్ల బీసీ బాలికల గురుకుల లో విద్యార్థినిలు భోజనం అడిగిన సందర్భంలో వారిని విచక్షణారహితంగా తిట్టి మోకాళ్లపై కూర్చోబెట్టి రాక్షసానందం పొందుతున్న ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోకపోతే మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు అని ఆయన హెచ్చరించారు పేద విద్యార్థులను చులకనగా చూస్తున్న ఇలాంటి ప్రిన్సిపల్స్ పై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు విద్యార్థినిలు నిత్యం ఏదో ఒక సమస్యతో బాధపడుతున్నప్పటికీ కూడా ప్రభుత్వ అధికారులు నేటికీ ఎందుకు స్పందించడం లేదని ఆయన అన్నారు గతంలో ఈ ప్రిన్సిపల్ పై అనేక ఆరోపణలు వచ్చినప్పటికీ కూడా మేము సెక్రటరీ గారికి విన్నపించుకున్నా కూడా నేటికీ స్పందించిన పాపాన పోలే నిత్యం విద్యార్థినిలను వేధింపులకు గురిచేస్తూనే ఉంటారు గతంలో మేము విజిట్ చేసిన సందర్భంలో విద్యార్థులు తినే కూరగాయలు పశువుల మేత కంటే దారుణంగా ఉన్నాయి దీనిపై గతంలోని మేము సెక్రటరీ గారికి తెలియచేసిన కూడా వారు కూడా ఎందుకు స్పందించడం లేదు.. గురుకులాలు నిత్యం పరిరక్షణ చేసే ఆర్ సి ఓ గారు ఎందుకు ఈ అంశంపై నోరు విప్పడం లేదో చెప్పాలి నిత్యం ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రిన్సిపాల్ పై తగు ఎంక్వయిరీ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోకపోతే మాత్రం ఈ రాష్ట్రంలో పేద విద్యార్థులు చదువుకునే గురుకులాలపై విద్యార్థుల తల్లిదండ్రులు నమ్మకాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన అన్నారు విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడానికి విద్యార్థి సంఘ నాయకులు గురుకులాలకు వెళ్తే లోపటికి అనుమతి లేదు అంటూ గేటుకు తాళాలు వేస్తున్న సందర్భం ఈ నల్గొండ జిల్లాలో ఏర్పడ్డది తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా నల్గొండ జిల్లాలో మాత్రం గురుకులాలను విద్యార్థి సంఘ నాయకులు ప్రవేశం లేకుండా పాఠశాల బయట ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన సందర్భం ఈ నల్గొండ జిల్లా ఆర్ ,సి ,ఓ గారు ఎందుకు విద్యార్థి సంఘం నాయకులను లోనికి ప్రవేశించడం కుదరదు అంటూ ప్రిన్సిపల్స్ కి ఎందుకు ఆదేశాలు ఇచ్చారో చెప్పాలి నిత్యం సమస్యగా మారుతున్న దామాచర్ల గురుకుల ప్రిన్సిపాల్ ని డిస్మిస్ చేయాలని ఆయన అన్నారు .. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జక్క నాగేశ్వరరావు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు కొర్ర పెడతా సురేష్, బీసీ, ఎస్సీ ఎస్టీ సంఘ జిల్లా నాయకులు పట్టేటి రమేష్, బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి గంగాధర్, బీసీ యువజన సంఘం నాయకులు ఉపేందర్, రమరాజు, నరేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు

## ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తే రేషన్ కార్డు రద్దు అవుతాయనే ప్రచారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి

**బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**



**హైద్రాబాద్ ఏప్రిల్ 01 నేటి వెలుగు ప్రతినిధి**

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ధనిక,పేద,మధ్య తరగతి అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తున్నారని కానీ ప్రస్తుతం ఐటీ రిటర్న్స్ దాఖలు చేసిన వారి రేషన్ కార్డులు రద్దవుతాయని ప్రచారం జోరుగా సాగుతుందని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని బీసీ జేఏసీ రాష్ట్ర జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు.ఆదాయం ఎక్కువ లేకున్న మధ్య తరగతి ప్రజలు వ్యక్తి గత రుణాల కోసం,ఇంటి రుణాల కోసం ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తున్నారని ఇలా మూడు సంవత్సరాల ఐటీ రిటర్న్స్ దాఖలు చేసిన వారికి మాత్రమే బ్యాంక్ లు గానీ,రాష్ట్ర ప్రభుత్వం గాని వ్యక్తిగత రుణాలు,ఇంటి లోన్లు గాని ఇస్తున్నారని అన్నారు.ఏదైనా పరిహారం పొందాలన్నా ఏదైనా వ్యక్తిగత ఆస్తులు అమ్మాలన్న ఐటి రిటర్న్స్ అనేవి తప్పనిసరి అయ్యాయని పేర్కొన్నారు.ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ ఆలోచన ఉంటే వెంటనే విరమించుకోవాలని లింగంగౌడ్ డిమాండ్ చేశారు

# కార్మిక హక్కులపై కేంద్ర ప్రభుత్వ దాడి -- 4 లేబర్ కోడ్లు వెంటనే రద్దు చేయాలి

**చట్టాల మార్పు కాదు -- కార్మిక హక్కుల అపహరన**

**నల్గొండ ఏప్రిల్ 01 నేటి వెలుగు ప్రతినిధి**

కేంద్ర ప్రభుత్వం నేటి నుండి అమలు చేయబోతున్న నూతన 4 లేబర్ కోడ్లు కార్మిక వర్గంపై తీవ్రమైన దాడి అని,ఇది చట్టాల మార్పు కాదు -- కార్మిక హక్కుల అపహరణ అని . ఈ కోడ్లు కార్మికుల శ్రమను చౌకగా మార్చి, పెద్ద కార్పొరేట్ సంస్థల లాభాల కోసం రూపొందించిన దోపిడీ విధానాలు మాత్రమేనని, దీనిని వ్యతిరేకిస్తూ జాతీయ పిలుపులో భాగంగా ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్లగొండ సుభాష్ విగ్రహం వద్ద "బ్లాక్ డే"గా పాటిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరా రెడ్డి, ఏఐటీయూ సి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు అంబటి సోమయ్య, ఐఎఫ్ టియు జిల్లా అధ్యక్షులు బొల్గురి నరసింహ మాట్లాడుతూ కార్మిక హక్కులను రక్షించుకోవడం కోసం ప్రతి కార్మికుడు ఈ పోరాటంలో భాగస్వామి కావాలని పిలుపునిస్తున్నామన్నారు.

**పని గంటల పెంపు -- శ్రమ దోపిడీ పెరుగుదల**

కొత్త కోడ్ల ద్వారా పని గంటలను పెంచే అవకాశం ఉందన్నారు. ఇది కార్మికుల ఆరోగ్యం, జీవన నాణ్యతను దెబ్బతీస్తుందని, ఉద్యోగ భద్రత లేకపోవడం 300 మందికి లోపల ఉద్యోగులు ఉన్న సంస్థల్లో ప్రభుత్వం అనుమతి లేకుండా ఉద్యోగాలను తొలగించే స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా ఉద్యోగ భద్రత పూర్తిగా నశిస్తుందన్నారు. యూనియన్ హక్కులపై పరిమితులు పెట్టారని కార్మిక సంఘాలను ఏర్పాటు చేయడం, సమ్మె చేయడం వంటి హక్కులను పరిమితం చేస్తూ కార్మికుల స్వరాన్ని అణచివేయడం జరుగుతోందన్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థ పెరుగుదల పర్మినెంట్ ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్ట్ ఉద్యోగాలను ప్రోత్సహించడం ద్వారా కార్మికులను అస్థిర జీవితానికి నెట్టివేస్తున్నారన్నారు. వేతనాలు, సంక్షేమంపై దెబ్బ మినిమమ్ వేతనాలు, బోనస్, సామాజిక భద్రత వంటి అంశాలను బలహీనపరచి కార్మికుల హక్కులను తగ్గిస్తున్నారన్నారు . అందుకే కేంద్ర ప్రభుత్వంను వెంటనే 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను బలోపేతం చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత, గౌరవప్రద వేతనాలు కల్పించాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను తగ్గించి పర్మినెంట్ ఉద్యోగాలను పెంచాలి యూనియన్ హక్కులను పూర్తిగా రక్షించాలని డిమాండ్ చేస్తున్నదన్నారు. ఈ లేబర్ కోడ్లు కార్మికుల భవిష్యత్తుపై దాడి అని . ఇది కేవలం చట్టాల మార్పు కాదని -- కార్మిక హక్కుల అపహరణ. కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా, కార్మిక హక్కుల రక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు.ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి సలీం, ఐఎన్టీయూసీ జిల్లా కార్యదర్శి సుంకిశాల వెంకన్న, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి దొనకొండ వెంకన్న ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మిడి నగేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, సహాయ కార్యదర్శి అవుట రవీందర్,, వివిధ సంఘాల నాయకులు ఏం నందం, సంబి రెడ్డి, సిహెచ్. అనురాధ, యూసుఫ్, నాగరాజు, నరసింహ , సీతరాములు , శంకర్, ఇందూరి సాగర్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## నాకు వయసుతో పాటే బైకులపై ఆసక్తి పెరుగుతూ వచ్చింది: రాజశేఖర్

సీనియర్ నటుడు డాక్టర్ రాజశేఖర్, తన భార్య జీవిత గురించి ఓ సరదా విషయాన్ని మీడియా ముందు పంచుకున్నారు. తనకు ఎంతో ఇష్టమైన బైక్‌ను, తనకు తెలియకుండానే జీవిత అమ్మేశారని ఆయన నవ్వుతూ చెప్పారు. శర్వానంద్ హీరోగా నటిస్తున్న 'బైకర్' సినిమా ప్రచార కార్యక్రమంలో భాగంగా నిన్న హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఈ ఆసక్తికర సంఘటనను ఆయన వెల్లడించారు.బైక్స్ అంటే తనకెంత ఇష్టమో వివరిస్తూ, చిన్నప్పటి నుంచి తనకు బైక్స్ అంటే చాలా ఇష్టమని, అమ్మమ్మగారింట్లో బుల్లెట్‌పై ఊరంతా తిరిగేవాడినని ఆయన గుర్తుచేసుకున్నారు. తనకు వయసుతో పాటు బైకులపై కూడా ఆసక్తి పెరుగుతూ వచ్చిందన్నారు. ఆ క్రమంలోనే శేషు సినిమా సమయంలో షూటింగ్ కోసం తాను స్వయంగా యమహా 650 బైక్‌ను కొనుగోలు చేశానని. ఆ తర్వాత కూడా దాన్నే కొన్నాళ్లు నడిపానని చెప్పారు. అయితే, నేను నడిపే విధానం చూసి జీవిత ఆందోళన చెందిందన్నారు. స్పీడ్‌గా డ్రైవ్ చేస్తున్నానని భయపడి తనకు తెలియకుండా జీవిత బైక్ అమ్మేసిందని నవ్వుతూ చెప్పారు.కాగా, ఏప్రిల్ 3న విడుదల కానున్న 'బైకర్' చిత్రంలో రాజశేఖర్ 'బుల్లెట్ సునీల్' అనే కీలక పాత్రలో నటిస్తున్నారు. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ రేసింగ్ చిత్రంగా ఇది తెరకెక్కుతోంది. ఈ సినిమాతో పాటు, తాను 'మగాడు' అనే మరో చిత్రంలో నటిస్తున్నానని, అలాగే తన కుమార్తె శివానితో కలిసి ఓ సినిమాలో కనిపించనున్నట్లు రాజశేఖర్ తెలిపారు.

## హీరోలకు డ్రగ్స్ టెస్టులు.. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై మంచు విష్ణు కౌంటర్

రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణ అంశంపై జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, సినీ నటుడు మంచు విష్ణు మధ్య మాటల యుద్ధం మొదలైంది. సినిమా హీరోలు ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలంటూ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలకు విష్ణు తనదైన శైలిలో సోషల్ మీడియా వేదికగా గట్టి కౌంటర్ ఇచ్చారు. ఈ వ్యవహారం ప్రస్తుతం ఇండస్ట్రీ వర్గాల్లో, రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.వివరాల్లోకి వెళితే... జడ్చర్లలో డ్రగ్స్ నియంత్రణపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడారు. డ్రగ్స్ అనగానే సినిమా ఇండస్ట్రీ పేరు వినిపిస్తోందని, ప్రజల్లోనూ అదే అభిప్రాయం ఉందని ఆయన అన్నారు. సమాజంలో హీరోలకు ఉండే క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని, వారు అభిమానులకు ఆదర్శంగా నిలవాలని హితవు పలికారు. ఇందులో భాగంగా హీరోలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలని సూచించారు. అలా చేస్తే వారి అభిమానులు కూడా డ్రగ్స్‌కు దూరంగా ఉంటారని, సమాజంలో మార్పు వస్తుందని అభిప్రాయపడ్డారు.డ్రగ్స్ వాడకాన్ని గుర్తించే పరీక్షల గురించి కూడా ఆయన స్పష్టతనిచ్చారు. మూత్ర పరీక్ష (యూరిన్ టెస్ట్) ద్వారా కేవలం 14 రోజుల వరకే తెలుస్తుందని, అదే వెంట్రుకల (హెయిర్) టెస్టుతో అయితే 90 రోజుల వరకు డ్రగ్స్ వాడకం బయటపడుతుందని ఆయన వివరించారు. అందుకే హీరోలకు హెయిర్ టెస్ట్ తప్పనిసరి చేయాలని, ఆ టెస్టులు చేయించుకుంటేనే వారి సినిమాలను విడుదల చేయాలని, ఇలా చేస్తే డ్రగ్స్ ఎందుకు కంట్రోల్ కావని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొందరు నెటిజన్లు ఆయన సూచనను సమర్థిస్తూ, హీరోలు ఆదర్శంగా నిలవడంలో తప్పులేదని అంటుండగా, మరికొందరు విమర్శిస్తున్నారు. రాజకీయ నాయకులపై కూడా ఆరు నెలలకోసారి ఐటీ దాడులు చేసి, వారి ఆస్తులను బహిర్గతం చేస్తే ప్రజలు నమ్ముతారని ఒక నెటిజన్ చురక అంటించారు. ఈ వివాదంపై సినీ నటుడు, 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు ఎక్స్ వేదికగా స్పందించారు. "ఇది చాలా మంచి సూచన" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తూనే, ఎమ్మెల్యేకు కౌంటర్ ఇచ్చారు. "ఎన్నికల్లో నామినేషన్ వేసే ముందు రాజకీయ నాయకులు ఎలాంటి పరీక్షలు చేయించుకోవాలో నేను ఆలోచిస్తున్నాను. ప్రజా ప్రతినిధులు కూడా పారదర్శకంగా ఉంటే ఓటర్లు సంతోషిస్తారని నేను భావిస్తున్నాను" అని విష్ణు తన పోస్టులో పేర్కొన్నారు. దీంతో ఈ వివాదం హీరోలు వర్సెస్ రాజకీయ నాయకులుగా మారింది.








## ముంబై బంగ్లాను లీజుకిచ్చిన సారా.. ఐదేళ్లకు రూ. 4 కోట్లకు పైగా డీల్

బాలీవుడ్ యువ నటి సారా అలీ ఖాన్ ముంబైలోని తన ఆస్తిని లీజుకు ఇచ్చి భారీ ఆదాయం పొందనున్న సెలబ్రిటీల జాబితాలో చేరారు. అంధేరీ వెస్ట్‌లోని తన బంగ్లాను ఐదేళ్ల కాలానికి గాను రూ. 4.14 కోట్లకు ఒక ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇచ్చారు. ప్రోడిజీ మాంటిస్సోరి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఈ ప్రాంగణాన్ని పాఠశాల కార్యకలాపాల కోసం ఉపయోగించుకోనుంది.ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ పత్రాల ప్రకారం, ఈ ఒప్పందం వివరాలు ఆసక్తికరంగా ఉన్నాయి. లీజు కాలం మే 1, 2026 నుంచి ప్రారంభమవుతుంది. మొదటి రెండేళ్ల పాటు నెలవారీ అద్దె రూ. 6.5 లక్షలుగా నిర్ణయించారు. మూడో ఏడాది నుంచి అద్దెపై 5 శాతం పెరుగుదల ఉంటుంది. దీని ప్రకారం, మూడో సంవత్సరంలో అద్దె రూ. 6.82 లక్షలకు, ఐదో సంవత్సరానికి రూ. 7.52 లక్షలకు చేరుకుంటుంది. ఈ ఒప్పందంలో భాగంగా అద్దెకు తీసుకున్న సంస్థ రూ. 20 లక్షల సెక్యూరిటీ డిపాజిట్‌ను చెల్లించింది. ముంబైలోని ఓల్డ్ లోఖండ్‌వాలా కాంప్లెక్స్‌లో ఉన్న ఈ బంగ్లా సుమారు 4,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఈ ఒప్పందంలో 36 నెలల లాక్-ఇన్ పీరియడ్ కూడా ఉంది.ఇటీవలి కాలంలో బాలీవుడ్ ప్రముఖులు తమ కమర్షియల్ ప్రాపర్టీలను లీజుకు ఇవ్వడం లేదా కొనుగోలు చేయడం ఒక ట్రెండ్‌గా మారింది. కొన్ని రోజుల క్రితం మాధురీ దీక్షిత్, రాకేష్ రోషన్ కూడా తమ ఆస్తులను లీజుకు ఇవ్వగా, నటుడు బాబీ డియోల్ రూ. 15 కోట్లతో ఆఫీస్ స్పేస్‌ను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**